13 వరకు మేడ్చల్ కోర్టులో లోక్ అదాలత్

శామీర్‌పేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ కోర్టులో 8వ తేదీ నుంచి 13 వరకు లోక్ అదాలత్ జరుగుతున్నట్లు అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని జీనోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ గురువయ్య తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాజీ పడేందుకు వీలు ఉన్న కేసుల్లో ఇరు వర్గాలవారు లోక్ అదాలత్‌లో పరిష్కారం చేసుకోవాలన్నారు. చిన్నచిన్న తగాదాల్లో కేసులు నమోదైన వారు సైతం కోర్టు వారు కల్పించిన ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఇన్‌స్పెక్టర్ సూచించారు.



17 నుంచి మెగా హెల్త్ క్యాంపులు

వికారాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబర్ 17, అక్టోబర్ 2 తేదీల్లో మెగా హెల్త్ క్యాంపులు, అలాగే ఈ నెల 18 నుంచి అక్టోబర్ 1 వరకు రోజుకు పది శిబిరాల చొప్పున ఏర్పాటు చేస్తామని డీఎంహెచ్‌వో లలితాదేవి పేర్కొన్నారు. సోమవారం స్వస్థ నారి స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్లు, ఎంఎల్‌హెచ్‌పీలతో ఆమె జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా లలితాదేవి మాట్లాడుతూ ఈ శిబిరాల్లో మహిళా ఆరోగ్య సంరక్షణకు అవసరమైన అన్ని రకాల వైద్య సేవలు అందిస్తామన్నారు. హెల్త్ క్యాంపులను రెడ్‌క్రాస్ సొసైటీ, యువజన సంఘాలు, మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రముఖుల సహకారంతో నిర్వహించనున్నట్లు తెలిపారు.





ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అధికారులతో సమీక్షిస్తున్న ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

జాప్యం చేస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెట్టండి

- కాంట్రాక్టర్ల తీరుపై ఆర్‌అండ్‌బీ మంత్రి అసహనం
- తాండూరు బీటీ రోడ్లపై అధికారులతో సమీక్ష

తాండూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పనుల నిర్వహణలో జాప్యం చేస్తే కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ఆర్‌అండ్‌బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అధికారులను ఆదేశించినట్లు సమాచారం. తాండూరులో 'బీటీ రోడ్లకు గ్రహణం' అనే శీర్షికన శనివారం ప్రచురితమైన ఆంధ్రజ్యోతి కథనంపై మంత్రి అధికారులతో సమీక్షించారు. సోమవారం తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ సీఈ మోహన్‌నాయక్, ఎస్‌ఈ వసంత నాయక్‌లతో సమావేశం నిర్వహించారు. తాండూరు - వికారాబాద్ రోడ్డు ప్రధాన కాంట్రాక్టర్‌తో మంత్రి ఫోన్‌లో మాట్లాడి వారం రోజుల్లో పనులు ప్రారంభం కావాలని ఆదేశించారు. ఒక దశలో అధికారులు, కాంట్రాక్టర్ల తీరుపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. దీంతో కాంట్రాక్టర్లు తాండూరు -వికారాబాద్, తాండూరు - కోట్‌పల్లి రోడ్డు మార్గాల్లో వెంటనే పనులు చేపట్టాలని నిర్ణయించారు. కాగా, తాండూరు - వికారాబాద్ రోడ్డును రెండు రోజుల్లో ప్రారంభించేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు చేపట్టినట్లు తెలుస్తోంది. మంత్రి సమీక్ష అనంతరం ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మోహన్‌నాయక్ వికారాబాద్ జిల్లాకు చెందిన ముగ్గురు కాంట్రాక్టర్లను పిలిపించి మాట్లాడినట్లు సమాచారం.

విద్యా వ్యవస్థ మార్పునకు చర్యలు

- ఉన్నతంగా తీర్చిదిద్దేందుకే క్షేత్ర స్థాయి అధ్యయనం
- రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆకునూరి మురళి

వికారాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విద్యా వ్యవస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు అమలు చేయాల్సిన సమూల మార్పుల కోసం క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేస్తున్నామని విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి అన్నారు. సోమవారం ఆయన, కమిషన్ సభ్యులు పీఎల్ విశ్వేశ్వర్ రావు, డాక్టర్ చారుకొండ వెంకటేశ్, జ్యోత్స్నా శివారెడ్డితో కలిసి వికారాబాద్‌లోని ప్రభుత్వ జూనియర్, డిగ్రీ, డైట్ కళాశాలలను తనిఖీ చేశారు. ప్రభుత్వ కళాశాలల్లో మౌలిక సదుపాయాలు,

మిగతా 8వ పేజీలో...

చైర్మన్‌ను సన్మానించిన స్పీకర్

కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు సోమవారం స్థానిక క్యాంప్ కార్యాలయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా ఆకునూరి మురళితో పాటు సభ్యులు పీఎల్ విశ్వేశ్వర్‌రావు, డాక్టర్ చారుకొండ వెంకటేశ్, జ్యోత్స్నా శివారెడ్డిలను స్పీకర్ శాలువాలతో సన్మానించారు.



అన్నప్రసాద కేంద్రంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న మాజీ మంత్రి మల్లారెడ్డి

వెంకన్న సేవలో మల్లన్న

మేడ్చల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): మేడ్చల్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి తన పుట్టిన రోజు వేడుకలను జరుపుకునేందుకు సోమవారం తిరుపతికి చేరుకున్నారు. నియోజకవర్గానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి ఉదయం కాలినడకన తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు వేద ఆశీర్వచనం అందజేసి, ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అన్నప్రసాద కేంద్రంలో ఆయన భక్తులకు భోజనం వడ్డించారు.

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

మేడ్చల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణి దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మను చౌదరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్.. అదనపు కలెక్టర్లు రాధికాగుప్తా, విజయేందర్‌రెడ్డిలతో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తిరస్కరించే దరఖాస్తుల గురించి సరైన సమాచారం అందజేయాలని సూచించారు. ప్రజావాణిలో మొత్తం 86 దరఖాస్తులు స్వీకరించారు. కార్యక్రమంలో డీఆర్‌వో హరిప్రియ, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

స్థానిక ఎన్నికలకు సహకరించాలి

- వికారాబాద్ అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రానున్న స్థానిక ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ ప్రతినిధులు తమవంతు సహకారం అందించాలని అదనపు కలెక్టర్ సుధీర్ కోరారు. సోమవారం జిల్లా స్థాయిలో స్థానిక సంస్థల ఎన్నికల ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్ల జాబితాపై రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ అసెంబ్లీ నియోజకవర్గాల వారి ఓటరు జాబితాననుసరించి పంచాయతీ, వార్డుల వారీగా ఓటరు జాబితా సిద్ధం చేశామన్నారు. పోలింగ్ బూత్‌ల జాబితా పోలింగ్ కేంద్రాల విషయం ఏమేని అభ్యంతరాలు ఉంటే తెలపాలన్నారు. జిల్లాలోని 594 గ్రామ పంచాయతీల్లో 5,058 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. అలాగే జిల్లాలో 6,98,478 ఓటర్లు నమోదు అయ్యారని వివరించారు. సమావేశంలో డీపీవో జయసుధ, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.



లంబాడాలపై అసత్య ప్రచారం తగదు



అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తూ నిరసన తెలుపుతున్న గిరిజన సంఘం నాయకులు

మోమిన్‌పేట్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): లంబాడాలపై అసత్య ప్రచారం చేయడం తగదని, కాంగ్రెస్ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, సోయం బాబురావును పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని లంబాడా హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్ అన్నారు. సోమవారం మోమిన్‌పేట్ తహసీల్దార్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బంజార లంబాడాలు సింధు నాగరికత కాలం నుంచే ఈ దేశ మూలనివాసులని, దేశ స్వాతంత్ర్యానికి ముందే గిరిజనులుగా గుర్తింపు పొందారన్నారు. లంబాడాలను ఎస్టీల జాబితా నుంచి తొలగించాలని ఎమ్మెల్యే వెంకట్రావ్, బాబురావులు పిటిషన్ దాఖలు చేశారని ఆరోపించారు. ఇది కాంగ్రెస్ పార్టీ ఆదేశాల మేరకు జరిగిందా అనేది సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సమాధానం చెప్పాలన్నారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో గోర్‌సేన జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ దోమ మండల కార్యదర్శి రవీందర్, నాయకులు కాశీరాంనాయక్, దీప్లానాయక్, గోపాల్, గణపతినాయక్, లచ్చునాయక్, చంద్‌నాయక్, రాజు, భస్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

మరకత శివాలయాన్ని దర్శించుకున్న సినీ నటుడు సురేష్



సురేష్‌తో ఆలయ అర్చకులు

శంకర్‌పల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సినీ నటుడు సురేష్ తెలిపారు. చందిప్పలోని మరకత శివాలయాన్ని సోమవారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు అభిషేకం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మరకత శివలింగాన్ని దర్శించుకోవడం తన అదృష్టమని అన్నారు. అర్చకులు సాయిశివ, ప్రమోద్‌లు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు నటుడు సురేష్‌ను స్వామివారి శేష వస్త్రంతో సత్కరించి చిత్రపటాన్ని బహూకరించారు.

ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

● అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

వికారాబాద్, సెప్టెంబర్ 8 (ఆంధ్రజ్యోతి): పెన్షన్, వ్యవసాయం, గృహ నిర్మాణ శాఖ, భూసమస్యలపై ఫిర్యాదులు అందాయని, ఆ ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 83 ఫిర్యాదులను స్వీకరించారు. మండల ప్రత్యేకాధికారులు గ్రామాల్లో శానిటేషన్‌పై దృష్టిసారించాలని, స్కూల్స్, హాస్టళ్లలో విద్యార్థులు అందించే భోజనాన్ని ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలని ఆదేశించారు. ప్రజలకు డెంగ్యూ, మలేరియా జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ హర్ష్‌చౌదరి, డీఆర్వో మంగ్లీలాల్, ఆర్డీవో వాసుచంద్ర పాల్గొన్నారు.

అన్ని మాడ్యూల్స్‌లో పరిశీలించాలి

జిల్లాలో భూభారతి చట్టం రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను అన్ని మాడ్యూల్స్‌లో పరిశీలించి పూర్తిచేయాలని అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయం నుంచి తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రెవెన్యూ సదస్సుల్లో తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి డేటా ఎంట్రీ చేయాలని, గ్రామాల వారీగా రైతుల నుంచి తీసుకున్న దరఖాస్తుల సాదాబైనామా, ఆర్ఓఆర్ సమస్యలు, పట్టా పాస్‌బుక్‌లలో కరెక్షన్స్ వంటి వాటిపై పరిశీలించి త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూభారతి పెండింగ్ అప్లికేషన్ల వివరాలపై తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఏ ఒక్క అప్లికేషన్‌ను పెండింగ్‌లో పెట్టకుండా పూర్తిచేయాలని చెప్పారు. రేషన్ కార్డు దరఖాస్తులను పూర్తి స్థాయిలో పరిశీలించి అర్హత కలిగిన వారికే కార్డు వచ్చేలా చూడాలని, ఎట్టి పరిస్థితుల్లో అర్హత లేని వారికి రేషన్ కార్డు ఇవ్వకుడా చూడాల్సిన బాధ్యత తహసీల్దార్లదేనని సూచించారు. సమావేశంలో డీఆర్వో మంగ్లీలాల్, సబ్‌కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, ఆర్డీవో వాసుచంద్ర, అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కింద అనేక మంది విద్యార్థులు ప్రైవేట్ స్కూళ్లలో చదువుతున్నారని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. అదనపు కలెక్టర్ లింగ్యానాయక్‌ను కలిసి బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం కింద ఉన్న బకాయిలను విడుదల చేయాలని జిల్లా కమిటీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. కొన్ని నెలలుగా ఈ స్కీం కింద పాఠశాలల బకాయిలు విడుదల కాక విద్యా సంస్థలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని తెలిపారు. ఇది విద్యా హక్కును ప్రభావితం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీకాంత్ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శ్రీనివాస్

రేపు తుది ఓటరు జాబితా

● స్థానిక సంస్థల జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్

● అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల ఓటర్ల తుది జాబితాను ఈ నెల 10వ తేదీన వెలువరిస్తామని జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్(లోకల్ బాడీస్) కె.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ శ్రీనివాస్ అధ్యక్షత వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. వారితో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇప్పటికే ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేశామని తెలిపారు. ముసాయిదా జాబితా, పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని నాయకులకు సూచించారు. వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు చేర్పులు జరిపిన మీదట సెప్టెంబరు 10న తుది జాబితా వెలురిస్తామన్నారు. మండలస్థాయిలో నిర్వహించిన రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధుల సమావేశంలో కూడా అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, డిప్యూటి సీఈవో రంగారావు, ఆయా పార్టీల నాయకులు మహేష్‌గౌడ్, వనం శ్రీనివాస్, కె.అనంతయ్య, అంబాజీ శ్రీనివాస్, పగడాల యాదయ్య, పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, జె. రవీందర్, సంబంధిత అధికారులు తదితరులు ఉన్నారు.

ఏఎన్ఎంలపై పని భారాన్ని సహించం



అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందిస్తున్న నాయకులు

రంగారెడ్డి అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి):తెలంగాణ రాష్ట్రంలో వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఏఎన్ఎంలపై పనిభారం మోపి వారి ప్రాణాలను హరించొద్దని తెలంగాణ రాష్ట్ర రెండో ఏఎన్ఎంల సంఘం(ఏఐటీయూసీ) రాష్ట్ర అధ్యక్షురాలు జె.పద్మ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్య శాఖలో పేపర్ లెస్ ప్రోగ్రామ్స్ అంటూ మొబైల్ అప్లికేషన్స్ యాప్‌లను తీసుకువచ్చి ఉద్యోగులను నానా ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పారు. నాన్ కమీషనబుల్ డీసీసెస్ ప్రోగ్రాంలో 35 శాతం పాపులేషన్‌ను స్క్రీనింగ్ చేయాల్సిన బాధ్యత ఏఎన్ఎంల మీద ఉందని, కచ్చింతంగా చేసి తీరాల్సిందేనని అధికారులు బెదిరింపులకు గురిచేస్తున్నారని వారు వాపోయారు. ఏఎన్ఎంలో ప్రజారోగ్యం గురించి పనిచేస్తున్నారా లేక డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా పనిచేస్తున్నారా? అన్న అనుమానం కలుగుతోందన్నారు. ఇప్పటికైనా వేధింపులు మానకపోతే ఏఐటీయూసీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సువర్ణ, మంజుల, అమృత, స్వరూప, స్వప్న, సునీత, సుజాత ఉన్నారు.

హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలి

● ఆరోగ్య సమస్యలపై అవగాహన కల్పించిన వైద్యాధికారులు



ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న సబ్ యూనిట్ అధికారి ప్రకాశ్

తాండూరు రూరల్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి):తాండూరు మండల పరిధిలోని హైదరాబాద్ రోడ్డులో గల జ్యోతిబాపూలే వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, తాండూరు సబ్ యూనియన్ అధికారి ప్రకాశ్ అన్నారు. సోమవారం జిల్లా ఉప వైద్యాధికారి రవీందర్‌యాదవ్ ఆదేశాల మేరకు తన సిబ్బందితో కలిసి వసతి గృహాన్ని ఆయన పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న ఆహారాన్ని పరిశీలించారు. జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాలలో 450 మంది బాలురు విద్యనభ్యసిస్తున్నారని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సురేష్ వారికి తెలిపారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, పరిసరాలపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని సిబ్బందికి ఆయన సూచించారు. పౌష్టికాహార ంలో గుడ్డు, సాంబారుతోపాటు పెరుగు వంటి ఆరు పదార్థాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆయన వెంట తాండూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రి హెల్త్ అసిస్టెంట్ సుదర్శన్ తదితరులున్నారు.

అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : ఎమ్మెల్యే వీర్లపల్లి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందని, పెండింగ్ పనులకు సైతం నిధులు మంజూరు పూర్తి చేస్తున్నామని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ... కేశంపేటలో ఆగిపోయిన 30పడకల ఆసుపత్రి నిర్మాణ పనులకు రూ. 22.8లక్షల నిధులు మంజూరు చేయించానని తెలిపారు. లేమామిడి, నిర్దవెల్లి గ్రామాలకు రూ.20లక్షలు మంజూరు చేయించి విద్యుత్ మరమ్మతుల పనులు పూర్తిచేయించామన్నారు. బొదునంపల్లి, అల్వాల, కాకునూర్ గ్రామాల్లో అంగన్‌వాడీ భవన నిర్మాణాలకు రూ.36లక్షలు నిధులు మంజూరు చేశామని తెలిపారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు గూడ వీరేశ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, ఏఎంసీ డైరెక్టర్ భాస్కర్ గౌడ్, మండల ప్రధాన కార్యదర్శి గిరిధర్ యాదవ్ పాల్గొన్నారు.

భార్యను వేధించిన భర్తకు ఏడాది జైలు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ సరోజ

వికారాబాద్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): భార్యను వేధించిన భర్తకు ఒక సంవత్సరం జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ కొడంగల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు జడ్జి శ్రీరామ్ తీర్పు ఇచ్చారని వికారాబాద్ మహిళా పోలీస్‌స్టేషన్ సీఐ సరోజ సోమవారం తెలిపారు. 2019 సెప్టెంబరు 10న లగచర్లకు చెందిన చౌదర్పల్లి సుజాత మహిళా పోలీస్ స్టేషన్‌లో తన భర్త, అత్తమామలు అదనపు కట్నం కోసం తనను వేధిస్తున్నారని ఫిర్యాదు చేసిందన్నారు. అప్పటి ఎస్ఐ శ్రీకాంత్ కౌన్సిలింగ్ నిర్వహించి కేసు నమోదు చేశారన్నారు. నిందితులపై కోర్టులో చార్జిషీట్‌ను సమర్పించామని తెలిపారు. న్యాయమూర్తి కేసు విచారణ చేసి నేరస్థుడికి ఏడాది జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారన్నారు. నేరస్థునికి శిక్షపడేలా పనిచేసిన కోర్టు డ్యూటీ ఆఫీసర్ రామకృష్ణను ఈ సందర్భంగా సీఐ సరోజ అభినందించారు.

లైంగికదాడి కేసులో 20ఏళ్ల జైలు శిక్ష



శిక్ష పడిన మేరావత్ శ్రీను

మాడ్గుల, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొల్కులపల్లి పరిధి రాజీవ్‌తండాకు చెందిన వ్యక్తికి లైంగికదాడి కేసులో కోర్టు 20సంవత్సరాలు జైలు, 5వేల జరిమానా విధించినట్లు సీఐ వేణుగోపాలు సోమవారం తెలిపారు. కేసుకు సంబంధించి ఆయన చెప్పిన వివరాల ప్రకారం.. రాజీవ్ తండాకు చెందిన మేరావత్ శ్రీనుపై ఐదేళ్ల క్రితం లైంగికదాడి కేసు నమోదైందన్నారు. కేసును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో సోమవారం షాద్‌నగర్ జడ్జి అంజనేయులు విచారణ చేసి నిందితుడు మేరావత్ శ్రీను అలియాస్ చరణ్‌కు 20ఏళ్ల జైలు శిక్ష, 5వేల రూపాయల జరిమానా విధించారని సీఐ వేణుగోపాల్ తెలిపారు. కేసు దర్యాప్తు చేసిన సీఐ సైదులు, బి.ఉపేందర్‌రావు, అడిషనల్ పీపీ శంకరాచారి, కోర్టు డ్యూటీ ఆఫీసర్లు ఎస్‌కే.జాఫర్, యు.నాగరాజులను ఈ సందర్భంగా సీఐ వేణుగోపాల్ అభినందించారు.

గుప్త నిధుల తవ్వకాలు.. ఆరుగురిపై కేసు

బషీరాబాద్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): గుప్త నిధుల కోసం తవ్వకాలు జరిపిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు బషీరాబాద్ ఎస్ఐ నుమాన్‌అలీ సోమవారం తెలిపారు. బషీరాబాద్‌లోని ఓ పాడుబడిన భవనంలో ఆదివారం గుప్త నిధుల కోసం తవ్వకాలు జరుపుతుండగా పోలీసులు ఐదుగురిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకోగా, మంత్రగాడు పారిపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో పోలీసులు ఐదుగురిని ఆదే రోజు పోలీస్ స్టేషన్‌కు తరలించించి తాండూరు రూరల్ ఐసీ నగేశ్ నేతృత్వంలో విచారణ జరిపారు. రాత్రి వరకు విచారణ జరిపిన పోలీసులు కేసు నమోదు చేసుకుని వారిని వ్యక్తిగత పూచికతుపై వదిలిపెట్టారు. ఈ గుప్త నిధుల తవ్వకాలు స్థానికంగా కలకలం రేపాయి. ఇదిలా ఉండగా గుప్త నిధుల తవ్వకాలకు సంబంధించి స్థానికులు రకరకాలుగా చర్చించుకుంటున్నారు.

రంగారెడ్డి జిల్లా ఆర్టీఏ కార్యాలయానికి అదనపు సిబ్బంది నియామకం

నార్సింగ్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మణికొండలోని రంగారెడ్డి జిల్లా ఆర్టీఏ కార్యాలయానికి 22 మంది మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లును ప్రభుత్వం కేటాయించింది. దీంతో వీరంతా సోమవారం విధుల్లో చేరారు. వీరికి రంగారెడ్డి జిల్లా అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వీరికి సీనియర్ మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్‌రెడ్డి, నవీన్‌లు పలు సూచనలు సలహాలు అందజేశారు. వీరికి 20రోజులుపాటు శిక్షణ ఇచ్చి విధుల్లోకి పంపుతామన్నారు.



విధుల్లోకి చేరిన వారికి శిక్షణ ఇస్తున్న కిరణ్‌కుమార్‌రెడ్డి, నవీన్












సినిమా షూటింగ్‌ను ప్రారంభిస్తున్న డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి

నాగిశెట్టిపల్లిలో 'తాంత్రిక' షూటింగ్

శామీర్‌పేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధి నాగిశెట్టిపల్లిలో గల హరిహర ఆలయంలో సోమవారం తాంత్రిక సినిమా షూటింగ్‌ను డైరెక్టర్ రాగిరి విష్ణువర్ధన్‌రెడ్డి క్లాప్ కొట్టి ప్రారంభించారు. దేవతామూర్తులకు పూజలు చేసి షూటింగ్‌ను ప్రారంభించారు. డైరెక్టర్ మాట్లాడుతూ.. వీఎన్ క్రియేషన్ బ్యానర్‌పై అత్తపు నవీన్ సమర్పణలో ఈ చలన చిత్రాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ తాంత్రిక సినిమా హర్రర్ సస్పెన్స్ థ్రిల్లర్ అని చెప్పారు. విభిన్న ట్రీట్మెంట్‌తో రూపొందించి సంక్రాంతికి ఈ సినిమాను విడుదల చేస్తామని వెల్లడించారు. హిరోగా గణేష్‌రెడ్డి, హిరోయిన్లుగా మౌనిక, శ్రీవాణినాయుడు నటిస్తున్నారని తెలిపారు. సినిమాటోగ్రఫీ బాధ్యతలు అరవింద్ నిర్వహిస్తాడని చెప్పారు. సినిమా ఫస్ట్ షెడ్యూల్ ఇక్కడ పూర్తిచేసుకొని హైదరాబాద్, అరకు ప్రాంతాల్లో తదుపరి షెడ్యూల్స్‌ను ప్లాన్ చేశామని డైరెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో నిర్మాత, నటీనటులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న పోరాట సమితి, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

పెన్షన్లు పెంచి ఇవ్వాలి

వికారాబాద్, సెప్టెంబర్ 8(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగుల పెన్షన్ రూ.6వేలకు, ఇతర పెన్షన్లు రూ.4వేలకు పెంచాలని మహజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పి.ఆనంద్ డిమాండ్ చేశారు. సోమవారం వికారాబాద్ కలెక్టరేట్ ముందు పెన్షన్ల పెంపు, కొత్త పింఛన్ల మంజూరు, దివ్యాంగులకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం, బ్యాక్లాగ్ ఉద్యోగాల భర్తీ తదితర డిమాండ్లతో వికలాంగుల హక్కుల పోరాట సమితి, పెన్షన్ హక్కుల పోరాట సమితి, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీల ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. దరఖాస్తు చేసిన అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలన్నారు. అక్టోబర్ 11న హైదరాబాద్‌లో తలపెట్టిన మహా గర్జన సభలో పెన్షన్‌దారులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పెన్షన్ పెంపుపై వెంటనే నిర్ణయం తీసుకోకుంటే రానున్న ఎన్నికల్లో పెన్షన్‌దారులు తగిన గుణపాఠం చెప్తారన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ, మంజులరెడ్డి, స్వామిదాసు, సుభాష్, ప్రకాశ్, నరసింహ, మహేందర్ పాల్గొన్నారు.


శివగౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

హక్కుల సాధనకు పోరాడాలి

కడ్తాల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): హక్కుల సాధన, సమస్యల పరిష్కారానికి గౌడ సంఘం నాయకులు పోరాడాలని సంఘం మండల అధ్యక్షుడు మాలే మల్లేశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. కడ్తాలలోని కంఠమహేశ్వర స్వామి ఆలయంలో సోమవారం సంఘం సభ్యులు సమావేశమయ్యారు. కులస్తుల సమస్యలపై చర్చించి భవిష్యత్ ప్రణాళిక రూపొందించారు. మల్లేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు గౌడ కులస్తులకు అన్ని రంగాల్లో తగిన ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గౌడ కులస్థులకు తగిన అవకాశాలు కల్పించాలని కోరారు. సంఘ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మాలే శివగౌడ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌గౌడ్, శేఖర్‌గౌడ్, మహేశ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు అనిల్‌గౌడ్, శ్రీనుగౌడ్, నరేశ్‌గౌడ్, జగదీశ్‌గౌడ్, కార్యదర్శులుగా చిన్నాగౌడ్, సందీప్‌గౌడ్, సంయుక్త కార్యదర్శులుగా మహేందర్‌గౌడ్, శివగౌడ్, కోశాధికారి కార్తీక్‌గౌడ్, సహాయ కార్యదర్శులుగా నాగులుగౌడ్, హరీశ్‌గౌడ్,మరో 20మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. నూతన కమిటీని సత్కరించారు.


అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నరేందర్‌రెడ్డి

సేవల్లో లయన్స్ క్లబ్‌కు ప్రపంచ ఖ్యాతి

కడ్తాల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): సామాజిక సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ అంతర్జాతీయ స్థాయిలో అగ్రభాగాన నిలిచిందని క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ నరేందర్‌రెడ్డి అన్నారు. కడ్తాలలో సోమవారం రాంరెడ్డి లయన్స్ కంటీ ఆస్పత్రి ఛైర్మన్ డాక్టర్ దామోదర్‌రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. లయన్స్ క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చెన్న కిషన్ రెడ్డి, రీజియన్ ఛైర్మన్ జనార్ధన్‌రెడ్డి, జోన్ ఛైర్మన్ లింగయ్య, క్లబ్ అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, కడ్తాల మాజీ సర్పంచ్ వేణుగోపాల్, క్లబ్ కార్యదర్శి గంప శ్రీనివాస్, పీఆర్వో పాషా, హెచ్‌ఎం జంగయ్య, జంగారెడ్డి, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం బీకేఎంయూ ఆధ్వర్యంలో ఆర్డీవో సరితకు వినతిపత్రం ఇచ్చారు. బీకేఎంయూ జిల్లా కార్యదర్శి బుద్దుల జంగయ్య, తెలంగాణ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి మాట్లాడారు. భూమి లేని వ్యవసాయ కార్మికులకు ప్రభుత్వం ఇస్తామన్న రూ.12వేలను ఏటా ఇవ్వాలని కోరారు. అలాగే ఒంటరి మహిళలకు నాలుగు వేలు, దివ్యాంగులకు 6వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు రూ.25లక్షల బీమా సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రమేశ్‌యాదవ్, రాములు, దామోదర్‌రెడ్డి, వెంకటయ్య, షేక్ ఉస్మాన్ పాల్గొన్నారు.

భూమి పట్టా చేయడంలేదని టవరెక్కిన రైతు

మర్పల్లి, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): తన తాత పేరిట ఉన్న భూమిని తమ పేరిట మార్చడం లేదని ఓ రైతు సెల్ టవర్ ఎక్కిన సంఘటన మండలంలోని సిరపూరంలో సోమవారం చోటుచేసుకుంది. వడ్ల కాశీనాథ్ కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వీర్లపల్లికి చెందిన వడ్ల వీరప్పకు గ్రామంలో 24ఎకరాల భూమి ఉంది. ఈయనకు లక్ష్మయ్య, చంద్రయ్య, మోనప్ప, సుదర్శన్ నలుగురు కుమారులు. వీరు మృతిచెందడంతో వీరప్ప మనుమడు కాశీనాథ్ తాత పేరిట ఉన్న భూమి కుటుంబ సభ్యుల పేరిట చేయాలని కొన్నేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగాడు. 12ఎకరాల భూమి ఇతరుల పేర్లపై ఉందని అధికారులు చెబుతున్నారు. మిగతా భూమి కూడా తమ పేరిట చేయడం లేదని కాశీనాథ్‌తో సెల్ టవరెక్కి నిరసన తెలిపాడు. రెవెన్యూ అధికారులు, పోలీసులు హామీ ఇవ్వడంతో కిందికి దిగాడు.

అతిసార ముప్పు.. ఓఆర్ఎస్‌తో చెక్!

- వ్యాధి నిర్ధారణ కాగానే రోగికి ఓఆర్ఎస్ ద్రావకాన్ని తాగించాలి
- వేడి ఆహారాన్నే భుజించాలి
- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాధుల ముప్పు ఎక్కువ. బోర్లు, చెరువులు, కుంటల్లోకి కొత్త నీరు రావడం, ఆ నీటిని తాగడం, ఈగలతో ఆహార పదార్థాల కలుషితం వంటి కారణాలతో ప్రజలకు అతిసార వ్యాధి వచ్చే ఆస్కారం ఎక్కువ. ఈ వ్యాధి సోకితే తీవ్ర విరేచనాలు, చలిజ్వరం తదితర లక్షణాలుంటాయి. సకాలంలో చికిత్స పొందకుంటే ప్రాణాలకే ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. ఐదేళ్లలోపు పిల్లల మరణానికి రెండో ప్రధాన కారణం అతిసారగా వైద్యులు నిర్ధారించారు. వ్యాధి నివారణకు అధికారులు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. ప్రధానంగా ఓఆర్ఎస్(ప్రాణ రక్షక ద్రవం)పై అవగాహన కల్పిస్తారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సరైన పారిశుధ్య చర్యలు చేపట్టక, అతిసార వ్యాధిపై అవగాహన లేక తరచూ వ్యాధి బారిన పడుతున్నారు. అతిసారతో శరీరం అధిక మొత్తంలో నీరు, లవణాలను కోల్పోతుంది. వారికి తప్పనిసరిగా ఓఆర్ఎస్(ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్) ఇవ్వాలి. ఇవి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో ఉచితంగా అందజేస్తారు. అన్ని మెడికల్ దుకాణాల్లో అందుబాటులో ఉంటుంది.



20.5గ్రాములున్న ప్రామాణిక ఓఆర్ఎస్ ప్యాకెట్‌లో 2.6గ్రాముల సోడియం క్లోరైడ్, 13.5 గ్రాముల గ్లూకోజ్, 1.5గ్రాముల పొటాషియం క్లోరైడ్, 2.9గ్రాముల ట్రైసోడియం సిట్రేట్ ఉంటాయి. ఇవి రోగికి అత్యవసరం. ఒక ఓఆర్ఎస్ ప్యాకెట్ పొడిని కాచి చల్లార్చిన ఒక లీటరు నీటిలో కలిపి నాలుగైదు సార్లు తాగించాలి.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కలుషిత నీరు, కలుషిత ఆహారం, అపరిశుభ్ర వాతావరణం వంటి కారణాలతో అతిసార సోకే ప్రమాదం ఉంటుంది. కాచి చల్లార్చిన నీటినే తాగాలి. ఆహారం తీసుకునే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలి. వర్షం పడుతున్న, లేదా చల్లని సమయాల్లో వేడి ఆహారాన్నే భుజించాలి. నీళ్ల విరేచనాలు, జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే చికిత్స చేయించుకోవాలి. అతిసార బారిన పడితే ఓఆర్ఎస్ ద్రావకాన్ని తప్పక తాగాలి. ప్రభుత్వాసుపత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉచితంగా ఇస్తారు. ప్రతీ వ్యక్తి వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి.

లక్షణాలుంటే చికిత్స పొందాలి

శరీరం అలసటగా అనిపించడం, నోరు, పెదాలు, కళ్లు ఎండిపోవడం వంటి లక్షణాలుంటే ఆ వ్యక్తి డీహైడ్రేషన్‌కు గురైనట్లు గుర్తించాలి. ఇలాంటి సంకేతాలు కనిపిస్తే ఓఆర్ఎస్ ద్రావకాన్ని తాగాలి. దీనిపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తాం.

- బుష్రా ఫాతిమా, వైద్యురాలు, ప్రభుత్వ ఆసుపత్రి, అంగడి రైచూర్

యూరియా కొరత.. రైతుల కుతకుత

ఉదయం నుంచే బారులు ● ఒక్కో రైతుకు ఒక్క బస్తా అందజేత

- చాలా మందికి అదీ దొరకని వైనం
- కొరత తీర్చాలని పలు చోట్ల రైతుల ధర్నా


చౌదరిగూడలో ధర్నా చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న ఏవో

పరిగి/తాండూరు రూరల్/ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని సోమవారం ఉదయం నుంచే ఎరువుల దుకాణాలు, సొసైటీల వద్ద బారులుతీరారు. పరిగిలో యూరియా కోసం రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. పట్టణంలోని ఆగ్రోస్ కేంద్రానికి 200 బస్తాలొచ్చాయని తెలుసుకున్న రైతులు సోమవారం ఉదయమే చేరుకున్నారు. గంటల తరబడి లైన్లో నిలబడి యూరియా తీసుకున్నారు. ఒక్కో రైతుకు ఒక్క బస్తా ఇస్తే ఎట్లా? అని వాపోయారు. చాలా మందికి యూరియా దొరకక ఉత్త చేతుల్తో వెళ్లిపోయారు. వచ్చిన యూరియా కూడా ధర పెంచి అమ్ముతున్నారు. బస్తా ఎమ్మార్పీ రూ.265 ఉండగా రూ.300 నుంచి రూ.320 చొప్పున విక్రయించారు. మంగళవారం మరో 20టన్నుల యూరియా వస్తుందని ఆగ్రోస్ సెంటర్ నిర్వాహకులు తెలిపారు. తాండూరు మండలం ఎల్మకన్నె ప్యాక్స్ వద్దకు రైతులు ఉదయం 6గంటలకే వద్దకు చేరుకున్నారు. 300 మంది రైతులు వచ్చారు. 10 గంటలకు అధికారులు ఒక్కోబస్తా చొప్పున టోకెన్లు రాసిచ్చారు. టోకెన్ల ప్రకారం యూరియా అందజేశారు. ఒక్కబస్తా సరిపోదని రైతులు ప్రశ్నించారు. ఏడీఏ కొమురయ్య చేరుకుని రైతులతో మాట్లాడారు. 230 బస్తాలు ఉన్నాయని, ప్రతి రైతుకు యూరియా ఇస్తామని చెప్పారు. మంగళవారం మరో 30టన్నుల యూరియా వస్తుందని చెప్పడంతో రైతులు శాంతించారు. ఇబ్రహీంపట్నం పరిధి ఉప్పరిగూడ ప్యాక్స్ వద్ద సోమవారం రైతులు బారులు తీరారు. పోలీస్ పహారా మధ్య 300 బ్యాగుల యూరియాను సొసైటీలో సభ్యులుగా ఉన్న రైతులకు రెండు బస్తాల చొప్పున పంపిణీ చేశారు. మిగిలిన వారికి టోకెన్లు ఇచ్చి పంపారు. రెండ్రోజుల్లో యూరియా రానుందని అధికారులు చెప్పారు.

రైతుల రాస్తారోకో

చౌదరిగూడ/యాలాల: చౌదరిగూడలో యూరియా కోసం రైతులు రోడ్డుపై ధర్నా చేశారు. ఏవో రాజేందర్‌రెడ్డి చేరుకొని రైతులు ఆందోళన చెందొద్దని, మంగళవారం ఎదిర, చౌదరిగూడ రైతు వేదికల్లో యూరియా అందజేస్తామని తెలిపారు. దీంతో రైతులు ధర్నాను విరమించారు. యాలాల మండలం లక్ష్మీనారాయణపూర్ చౌరస్తాలో సమీపంలో గల ఆగ్రోస్ కేంద్రం వద్ద రైతులు ఆందోళన చేశారు. ఉదయం వస్తే ఒక్క రైతుకు ఒక్క బస్తా కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై ఆందోళన చేశారు. ఎస్ఐ విఠల్ చేరుకుని రైతులకు నచ్చజెప్పి పంపించారు.


పరిగిలో ఆగ్రోస్ కేంద్రం వద్ద క్యూ కట్టిన రైతులు


ఉప్పరిగూడ ప్యాక్స్ వద్ద బారులు తీరిన రైతులు

ఘట్‌కేసర్‌లో యువకుడి దారుణ హత్య

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): చిన్నచిన్న గొడవల కారణంగా ఓ యువకుడు మరో యువకుడిని హత్య చేశాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని బోయిగూడకు చెందిన చినగాని భాస్కర్(27) నెలరోజుల కింద పనినిమిత్తం వచ్చి ఘట్‌కేసర్‌లోని అంబేడ్కర్‌నగర్‌లో అద్దెకుంటున్నాడు. భాస్కర్‌తో పాటు పనిచేసే బిహార్‌కు చెందిన మణిదీప్ సైతం అతడి పక్క గదిలోనే అద్దెకుంటున్నాడు. ఇటీవల రోజూ మణిదీప్ చిన్న చిన్న విషయాలకు భాస్కర్‌తో గొడవపడుతున్నాడు. ఈ నెల 7వ తేదీన సాయంత్రం భాస్కర్‌తో మణిదీప్ గొడవపడి దాడి చేశాడు. అదే రాత్రి 9గంటల సమయంలో భాస్కర్ తన గదిపక్కనే ఉండే దాసుతో మణిదీప్ వద్దకు వెళ్లి తనతో ఎందుకు గొడవపడుతున్నావని నిలదీశారు.దీంతో రెచ్చిపోయిన మణిదీప్ కత్తితో భాస్కర్ ఛాతి, కడుపులో పొడిచాడు. నిలువరించిన దాసు తీవ్ర గాయాలైన భాస్కర్‌ను తన భార్య సాయంతో ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించాడు. అనంతరం భాస్కర్ కుటుంబసభ్యులకు సమాచారమిచ్చారు. మెరుగైన వైద్యంకోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అర్ధరాత్రి దాటాక భాస్కర్ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


చినగాని భాస్కర్ మృతదేహం

బెల్ట్ షాపునకు వేలం

- 3.6లక్షలకు దక్కించుకున్న వ్యక్తి

కీసర, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ జిల్లా నాగారం మున్సిపల్ పరిధిలోని కరీంగూడలో బెల్ట్‌షాపునకు వేలం నిర్వహించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ గౌడ సంఘం ఆధ్వర్యంలో బెల్ట్‌షాపునకు ఆదివారం వేలాన్ని నిర్వహించారు. గ్రామానికి చెందిన దేశం అంజయ్యగౌడ్ 3.6లక్షలకు వేలం పాడి బెల్ట్‌షాపు దక్కించుకున్నారని గ్రామస్థులు తెలిపారు. ఇతరులు బెల్ట్‌షాపు నిర్వహిస్తే సంఘం జరిమానా విధిస్తుందన్నారు. నగరానికి చేరువలో ఉన్న గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహించడం సిగ్గుచేటని గ్రామస్థులు అన్నారు. దీనిపై ఎక్సైజ్ సీఐ రవి స్పందిస్తూ.. సమగ్ర విచారణ జరిపి బెల్ట్‌షాపు వేలం నిర్వహించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. బెల్ట్‌షాపుల నిర్వహణ నేరమని, చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు.

డీజే తెచ్చిన తంటా

అనారోగ్యంతో బాలుడి మృతి

- డ్యాన్స్ చేయడం వల్లే అస్వస్థతకు గురై చనిపోయాడని కుటుంబీకుల ఆరోపణ
- మరో ఘటనలో యువకులపై లాఠీచార్జి
- డీజే గొడవల్లో కొందరిపై క్రిమినల్ కేసులు


నిమజ్జనం రోజు యువకులపై పోలీసుల లాఠీచార్జి


విహాన్(ఫైల్)

వికారాబాద్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం సందర్భంగా వికారాబాద్‌లో డీజే వాడకంతో పలు సమస్యలు ఉత్పన్నం అయ్యాయి. అనుమతి లేకున్నా అర్ధరాత్రి వరకు డీజే పెట్టారు. డీజే పాటలకు డ్యాన్స్ చేసిన అనారోగ్యంతో ఉన్న ఓ బాలుడు తీవ్ర అస్వస్థతకు గురై చనిపోయాడని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళ్తే.. అనంతగిరిపల్లికి చెందిన ఆరేళ్ల విహాన్ తొమ్మిదో రోజు వినాయక శోభాయాత్రలో పాల్గొన్నాడు. కాగా విహాన్ అప్పటికే అనారోగ్యంతో ఉన్నాడు. చాలా సేపు డీజే ఆడి ఇంటికి చేరిన బాలుడు అపస్మారక స్థితికి చేరాడు. తల్లిదండ్రుల మొదట స్థానిక ఆస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బాలుడు మృతిచెందాడు. బాలుడి మృతికి డీజే డ్యాన్సే కారణం అని కుటుంబీకులు అంటున్నారు. అలాగే 11వ రోజు ఎమ్మార్పీ చౌరస్తా వద్ద యువకులు డీజే డ్యాన్స్ చేస్తూ ఆలస్యం కాగా త్వరగా వెళ్లాలని పోలీసులు సూచించారు. యువకులు వినకపోవడంతో డీఎస్పీ, సీఐల ఆధ్వర్యంలో లాఠీచార్జి చేశారు. దీంతో పలువురికి గాయాలు కాగా ఒకరి ఫోన్ ధ్వంసమైంది. ఇదిలా ఉంటే శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదని పోలీసులు హెచ్చరించినా ఒత్తిళ్లతో అనుమతులివ్వడం, స్థానిక నాయకులు డీజేలను ప్రోత్సహించడం వంటి వాటితో సమస్యలొస్తున్నాయని ప్రజలంటున్నారు. డీజే డ్యాన్సులతో నిమజ్జనాలు బాగా ఆలస్యం అవుతున్నాయని చెబుతున్నారు. కాగా లాఠీచార్జి ఘటనపై డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి స్పందిస్తూ.. తాము లాఠీచార్జి చేయలేదన్నారు. డీజే దూరంగా వెళ్లింది.. మీరు కూడా ముందుకు వెళ్లాలని యువకులను కోరామన్నారు. వాళ్లలో వారే గొడవ పడితే కంట్రోల్ చేశామన్నారు. ఈ క్రమంలో కొద్దిగా తోపులాట మాత్రమే జరిగిందని ఆయన అన్నారు. కాగా గత నెల 31న డీజే నిర్వాహకులు, యువకుల మధ్య జరిగిన గొడవకు కారకులపై సీఐ భీమ్‌కుమార్ క్రిమినల్ కేసులు నమోదు చేశారు. వారు శాంతిభద్రతలకు భంగం కల్గించినందునే కేసు నమోదు చేశామని అదే రోజు సీఐ తెలిపారు.

అక్రమ మైనింగ్‌పై చర్యలు

- జీవని, క్యాద్గీరా గనుల్లో తవ్వకాలు నిలిపివేత


నాపరాతి గనిలో మిషన్‌ను తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

బషీరాబాద్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో నాపరాతి తవ్వకాలపై తహసీల్దార్ షాహిదాబేగం స్పందించారు. సోమవారం ఆంధ్రజ్యోతిలో 'యథేచ్ఛగా నాపరాళ్ల దోపిడీ' శీర్షికన వచ్చిన కథనంతో చర్యలు తీసుకున్నారు. కార్యాలయ జూనియర్ అసిస్టెంట్లు అంజిలప్ప, గోవింద్, సిబ్బంది మున్నప్ప, హన్మంతు జీవన్గి, క్యాద్గీరా ప్రాంతాల్లోని గనులపై దాడులు జరిపారు. అయితే అధికారుల రాకను పసిగట్టిన అక్రమార్కులు తవ్వకాలను నిలిపేసి పరారయ్యారు. రెవెన్యూ సిబ్బంది కటింగ్ మిషన్ల బెల్టులు, బ్లేడ్లు తొలగించి తీసుకెళ్లారు. తహసీల్దార్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ.. అక్రమ గనులపై నిరంతరం దాడులు చేస్తామని, అక్రమంగా తవ్వకాలు జరిపితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

కలుషిత జలాల నుంచి చెరువును కాపాడాలి

- కలెక్టరేట్ ఎదుట మత్స్యకారుల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కలుషిత జలాల నుంచి ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువును కాపాడాలని సోమవారం ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ మత్స్యకారులు, గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ఆందోళనకు దిగారు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డుతో పాటు చర్లపల్లి పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు ఎరిమల్లేవాగు నుంచి ఎదులాబాద్ చెరువులో కలుస్తున్నాయన్నారు. ఇటీవల వ్యర్థాలు చెరువులో కలవడంతో పెద్ద సంఖ్యలో చేపలు మృత్యువాత పడటంతో లక్షల్లో నష్టం వాటిల్లిందని వాపోయారు. అలాగే మృతి చెందిన చేపలకు పరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. 3 వేల ఎకరాల్లో చెరువు ఆయకట్టు కింద వరిసాగు చేస్తున్నారని, చెరువు నీరు కలుషితం కావడంతో దిగుబడి సైతం తగ్గుతుందన్నారు. ఈ మేరకు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, ఎదులాబాద్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు పూస యాదగిరి, కార్యదర్శి పూస నర్సింగ్‌రావు, మత్స్యకారులు, గ్రామస్తులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

వేధింపులు తాళలేక బాలిక ఆత్మహత్య

నవాబుపేట, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ప్రేమ వేధింపులు తాళలేక ఓ బాలిక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(17) అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వేధించడంతో మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో బాలిక సోమవారం ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. కుటుంబసభ్యులు బాలికను మొదట వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అక్కడి నుంచి వికారాబాద్ మిషన్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


మాణిక్‌రావుకు నివాళులర్పిస్తున్న ఆయన తనయుడు రమేశ్

మాజీ మంత్రి మాణిక్‌రావుకు ఘన నివాళి

తాండూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ నేత మాజీ మంత్రి స్వర్గీయ మాణిక్‌రావు వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన కుటుంబసభ్యులు వేర్వేరుగా కార్యక్రమాలు నిర్వహించారు. పీపుల్స్ డిగ్రీ కళాశాల ఆవరణలో మాణిక్‌రావు చిత్రపటానికి రాష్ట్ర ప్రణాళిక బోర్డు ఉపాధ్యక్షుడు మాజీ మంత్రి చిన్నారెడ్డి, మాణిక్‌రావు సతీమణి ప్రొఫెసర్ శశిప్రభ మాణిక్‌రావు, డీసీసీబీ మాజీ ఛైర్మన్ లక్ష్మారెడ్డి, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ స్వప్న, బీసీ కమిషన్ రాష్ట్ర మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ నివాళులర్పించి విగ్రహానికి పూలమాలలు వేశారు. 9వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన తనయుడు రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యుడు ఎం.రమేశ్ మహరాజ్, జిల్లా సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఉత్తం చందు, మాజీ జడ్పీటీసీ రాకేష్ తదితరులు నివాళులర్పించారు.


మాణిక్‌రావుకు నివాళులర్పిస్తున్న ఆయన సతీమణి శశిప్రభ, చిన్నారెడ్డి

టెట్‌పై సుప్రీం కోర్టు తీర్పును సమీక్షించాలి

బొంరాస్‌పేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లకుపైబడి సర్వీసున్న ఇన్ సర్వీస్ టీచర్లందరూ రెండేళ్లలో ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఉత్తీర్ణులు కావాలని, లేని పక్షంలో ఉద్యోగాన్ని వదులుకోవాలని ఆదేశిస్తూ సుప్రీంకోర్టు ఈ నెల 1న ఇచ్చిన తీర్పును పున సమీక్షించాలని టీఎస్ యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడారు.

అనుమతులు లేని కళాశాలపై చర్యలు తీసుకోవాలి



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

తాండూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా తాండూరులో కొనసాగుతున్న టీహెచ్ జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ విద్యార్థి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానికంగా తాండూరు పట్టణంలో 2024-25, 2025-26 అకాడమిక్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా కళాశాలను కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు. 80 మంది విద్యార్థులకు అడ్మిషన్లు తీసుకొని ఇంటర్మీడియట్ వార్షిక ఫీజు చెల్లింపు సమయంలో స్థానిక చైతన్య జూనియర్ కళాశాలలో అడ్మిషన్ పొందినట్లు చూపించి ఫీజులు వసూలు చేశారని ఆరోపించారు. జిల్లా నోడల్ అధికారికి పలుమార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. లేని పక్షంలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు.

ప్రజలకు కనీస వసతులు కల్పించాలి: సీపీఐ



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నరేంద్రప్రసాద్

శామీర్‌పేట, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూంకుంట మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను పరిశీలించి వెంటనే కల్పించాలని సీపీఐ శామీర్‌పేట మండల కార్యదర్శి డీజీ నరేంద్రప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో సోమవారం కమిషనర్ జ్యోతికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు తూంకుంట మున్సిపల్‌లోని పలు వార్డుల్లో ఏర్పడిన రోడ్ల గుంతలను పూడ్చాలని కోరారు. అదేవిధంగా పెద్దమ్మ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని మరమ్మతులు చేయించాలని కోరారు. మురికి కాలువలను మంచి నీటి కుంటల్లో కలుపకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహిస్తే సీపీఐ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సోగడ రమేష్, భూమయ్య, గౌరి, వసంత, మోహన్ పాల్గొన్నారు.

వసతి గృహాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న హర్ష్ చౌదరి

కొడంగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్సీ బీసీ, ఎస్టీ వసతి గృహాలను జిల్లా అసిస్టెంట్ ట్రెయినీ కలెక్టర్ హర్ష్ చౌదరి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహాల్లో విద్యార్థులతో మాట్లాడుతూ భోజనం, వసతులపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని వార్డెన్‌లకు సూచించారు. వసతి గృహాల్లో వంట గది, స్టోర్ రూమ్, బియ్యం, కూరగాయలను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు పాండు, వరలక్ష్మి, నిర్మల, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

మోమిన్‌పేట్/కులకచర్ల/దోమ/పరిగి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయాలని ఎంపీడీవో విజయలక్ష్మి, ఎంఈవో మల్లేశం ఉపాధ్యాయులకు సూచించారు. మోమిన్‌పేట్ మండలంలోని మేకవనంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గౌరీశంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అదేవిధంగా కులకచర్ల మండలంలోని ముజాహిద్‌పూర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం టీఎల్‌ఎం మేళా నిర్వహించారు. అదేవిధంగా దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి టీఎల్‌ఎం మేళాను ఎంఈవో వెంకట్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. పరిగిలోని జడ్పీహెచ్‌ఎస్ నం.01 పాఠశాలలో తహసీల్దార్ వెంకటేశ్వరి, ఎంఈవో గోపాల్‌లు మండలస్థాయి టీఎల్‌ఎం మేళాను నిర్వహించారు.

పరిగిలో 15 రోజులు సేవా కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న వీరేందర్‌గౌడ్

పరిగి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ 75వ జన్మదినాన్ని పురస్కరించుకుని సెప్టెంబరు 17 నుంచి అక్టోబరు 2 వరకు 15 రోజులపాటు సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పార్టీ నిర్ణయించిందని బీజేపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి తూళ్ళ వీరేందర్‌గౌడ్ అన్నారు. పరిగిలోని ఎస్‌వీ గార్డెన్‌లో సోమవారం జరిగిన సేవాపక్షం జిల్లా స్థాయి కార్యకర్తల సమావేశానికి ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కె.రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

బషీరాబాద్‌లో రోడ్డు పనుల అడ్డగింత

బషీరాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రూ.30కోట్ల వ్యయంతో బషీరాబాద్ గ్రామ పంచాయతీ మార్గంలో చేపడుతున్న రోడ్డు చదను, తవ్వకాల పనులను స్థానిక దుకాణ, ఇళ్ల యజమానులు సోమవారం అడ్డుకున్నారు. రోడ్డుకు ఇరువైపుల సమానంగా తవ్వకాలు జరుపుతుండగా ప్రభుత్వ భవనాలు ఉన్న వైపు ఎక్కువగా జరిగి పనులు చేపట్టాలన్నారు. ఘటనాస్థలానికి చేరుకున్న ఆర్‌అండ్‌బీ ఏఈ రిష్‌కుమార్ వారిని సముదాయించారు.

ఓటరు జాబితాలో మృతుల పేర్లు తొలగించరా?



ధారూరు: ధారూరులో రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశమైన అధికారులు

ధారూరు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రదర్శించిన తుది ఓటరు జాబితాలో మృతుల పేర్లను ఎందుకు తొలగించలేదని వివిధ రాజకీయ పార్టీల నాయకులు అధికారులను ప్రశ్నించారు. మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం ఎలక్టోరల్ డ్రాఫ్టు, పోలింగ్ స్టేషన్లపై అభ్యంతరాలపై అధికారులు సమావేశం నిర్వహించారు. వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఓటరు జాబితాలో పొరపాట్లను ఎత్తిచూపుతూ అభ్యంతరాలు వ్యక్తం చేశారు. ధారూరు, తరిగోపుల, ఎబ్బనూర్, గట్టేపల్లి గ్రామాలతో పాటు చాలా గ్రామాల్లో మృతి చెంది ఏళ్ల గడిచినా ఓటరు జాబబితాలో పేర్లు అలాగే ఉన్నాయని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఒకే పంచాయతీలో డబుల్ ఓట్లు, ఒక ఓటరు రెండు గ్రామాల ఓటరు జాబితాలో ఉన్నారని, వలస వెళ్లిన, వివాహాలు అయి వెళ్లిపోయిన వారి ఓట్లు ఓటరు జాబితాలో ఉన్నాయని వారు ఓటరు జాబితాపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కాగా ప్రస్తుతం ఓటరు జాబితాలో మృతుల పేర్లు తొలగించడం వీలుకాదని అధికారులు స్పష్టం చేశారు. సమావేశంలో తహసీల్దార్ సాజిదా బేగం, ఎంపీడీవో నర్సింహులు, ఎంపీవో షఫీఉల్లా, పార్టీల నాయకులు రాజునాయక్ పాల్గొన్నారు.

అభ్యంతరాలుంటే తెలపాలి

యాలాల/దుద్యాల/కులకచర్ల/కొడంగల్/తాండూరు రూరల్: ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలుంటే తెలపాలని యాలాల ఎంపీడీవో పుష్పలీల అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో అధ్యక్షతన సోమవారం ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో భాగంగా అన్ని పార్టీల ప్రజా ప్రతినిధులతో డ్రాఫ్ట్ ఓటరు లిస్టుపై సమావేశ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, బస్వరాజ్, బుగ్గప్ప, మల్కయ్య పాల్గొన్నారు. అదేవిధంగా దుద్యాల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో మహేశ్‌కుమార్ సోమవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. రాబోయే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు సజావుగా జరిగేలా సహకరించాలని కోరారు. ఎంఈవో విజయరామారావు, సూపరింటెండెంట్ శ్రీనివాసులు, సత్యనారాయణ, వేణుగోపాల్ పాల్గొన్నారు. అదేవిధంగా కులకచర్లలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రామకృష్ణ రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బీఎస్.ఆంజనేయులు, భరత్‌కుమార్, రవినాయక్, వెంకటేశ్ పాల్గొన్నారు. అదేవిధంగా కొడంగల్‌లోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులతో ఎంపీడీవో ఉషశ్రీ సమావేశం నిర్వహించారు. సూపరింటెండెంట్ బాలకృష్ణారెడ్డి, చంద్రయ్య, మురళీధర్‌రెడ్డి, రమేశ్‌బాబు, కృష్ణయాదవ్ పాల్గొన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో విశ్వప్రసాద్ అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశమయ్యారు. నాయకులు నాగప్ప, వీరేందర్‌రెడ్డి, శేఖాపురం ఆంజనేయులు, శ్రీహరి, నరేందర్‌రెడ్డి తదితరులున్నారు.

తప్పుల తడకగా ఓటరు జాబితా

దౌల్తాబాద్: దేవరఫస్లాబాద్‌లో ఓటరు జాబితా తప్పుల తడకగా మారింది. జాబితాలో తప్పిదాలు, చనిపోయిన వారి పేర్లు మళ్లీ వచ్చాయి. పెళ్లి అయిన వారిని కూడా తొలగించలేదు. డబుల్ ఓటరుగా నమోదు కావడం చోటు చేసుకున్నాయి. గ్రామంలో మొత్తం 10 వార్డుల్లో 1538 మంది ఓటర్లు ఉన్నారు. అందులో దాదాపు 120వరకు చనిపోయిన, పెళ్లి చేసుకొని వెళ్లిపోయిన వారి పేర్లు ఉండటం, నేమ్ కరెక్షన్ తో డబుల్ ఓట్లు, ఇతర గ్రామాల వారి పేర్లు సైతం జాబితాలో ప్రత్యక్షమయ్యాయి. అధికారుల తప్పిదంతో తప్పిదాలు జరిగాయని ప్రజలు ఆరోపించారు. పంచాయతీ కార్యదర్శులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వాపోయారు.

గురువులను గౌరవిస్తూ విద్యలో రాణించాలి



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న చంద్రారెడ్డి

కీసర రూరల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గురువులను గౌరవిస్తూ విద్యలో రాణించాలని నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, సీఐ ఆంజనేయులు అన్నారు. నాగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా సోమవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలోని ఉపాధ్యాయులను సత్కరించారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మండలంలోనే ప్రథమ స్థానంలో నిలిచిన బోడ శ్రీనివాస్‌కు ట్రోఫీతో పాటు రూ.11వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రాములు, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, సాయినాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేది ఉపాధ్యాయుడే అని ఎంజేపీటీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో సోమవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు.

కొడంగల్ రూరల్: విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపేది ఉపాధ్యాయుడే అని ఎంజేపీటీ గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ అన్నారు. కళాశాలలో సోమవారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులను సన్మానించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ధారూరు: మండల పరిధిలో ఎంపికైన 16 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సోమవారం ధారూరులో ఘనంగా సన్మానించారు. ఎంపీడీవో నర్సింహులు, ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డిలు ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలు కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు.



ధారూరు: సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

అధ్యాపకులను నియమించాలి



కళాశాల గేట్ దగ్గర తల్లిదండ్రుల ధర్నా

పరిగి, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): పరిగిలోని గిరిజన బాలికల రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో అధ్యాపకులను నియమించాలని సోమవారం విద్యార్థుల తల్లితండ్రులు గేట్ దగ్గర ధర్నా చేపట్టారు. విద్యా సంవత్సరం ప్రారంభం నాటి నుంచి మ్యాథ్స్ కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపకులు లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ విషయమై విద్యార్థులు సైతం గత నెల 7న ధర్నా చేపట్టారు. నెల రోజులు గడుస్తున్నా అధ్యాపకులను నియమించకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చేసినట్లు తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కనీసం తల్లిదండ్రులను లోపలికి కూడా అమతించకపోవడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుంచి బోధన జరగకపోతే ఎలా అని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్‌నాయక్, సీసీఐ నాయకులు పీర్‌మహ్మద్, ఎం.వెంకటేశ్‌లు వేర్వేరు ప్రకటనల్లో ప్రశ్నించారు. అధికారులు స్పందించి వెంటనే అధ్యాపకులను నియమించాలని సూచించారు. లేదంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు.

విద్యా వ్యవస్థ మార్పునకు చర్యలు

(ఐదో పేజీ తరువాయి)

బోధనా సిబ్బంది, విద్యార్థుల సంఖ్యపై ఆరా తీశారు. అలాగే విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడతూ ప్రభుత్వ కళాశాలలో చేపట్టాల్సిన పనులపై ప్రభుత్వానికి సమగ్ర నివేదిక అందజేస్తామన్నారు. తమ అధ్యయనంలో తెలుసుకున్న అధ్యాపకులు, విద్యార్థుల సమస్యలను కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్తామన్నారు. ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) విద్యార్థులు తమకు ఇంగ్లిష్, ఉర్దూ పాఠ్య పుస్తకాలు అందుబాటులో లేవని, వసతి గృహ సదుపాయం కల్పించాలని కమిషన్ చైర్మన్‌కు విజ్ఞప్తి చేయగా, ఆయన సానుకూలంగా స్పందించారు. డైట్ ఆవరణలో ఉన్న వసతి గృహంలో అవసరమైన మరమ్మతులు చేపట్టి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నిర్వహించేందుకు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

వసతుల కల్పనకు చర్యలు

ఇదిలా ఉంటే, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను చైర్మన్ ఆకునూరి మురళి, బృందం సభ్యులు స్వయంగా తెలుసుకున్నారు. అసంపూర్తి నిర్మాణంతో ఆర్‌సీసీ స్లాబ్ కింద చదువుకుంటున్న విద్యార్థులతో ఆయన మాట్లాడారు. జూనియర్ కళాశాలలో వెంటనే చేపట్టాల్సిన పనులపై ఆరా తీశారు. తరగతి గదులు లేక, వసతులు కొరవడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు, అధ్యాపకులు పడుతున్న ఇక్కట్లను వారు స్వయంగా చూశారు. వసతుల కల్పనకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన విద్యార్థులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి శంకర్ నాయక్, డీఈవో రేణుకాదేవి, జూనియర్, డిగ్రీ, డైట్ కళాశాలల ప్రిన్సిపాళ్లు వెంకటేశ్వరరావు, గీతాలక్ష్మి పట్నాయక్, రామాచారి, తదితరులు ఉన్నారు.



రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్, సభ్యులను సన్మానిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్

సమయం వృథా చేసుకోవద్దు



సమావేశంలో మాట్లాడుతున్న జేడీ లక్ష్మీనారాయణ

కీసర, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సమయం వృథా చేసుకోవద్దని మాజీ సీబీఐ జాయింట్ డైరెక్టర్ జేడీ లక్ష్మీనారాయణ అన్నారు. నాగారం మున్సిపల్ పరిధిలోని భోగారం గ్రామంలోని హోలీమేరీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఓరియేంటేషన్ డే జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ చదివే విద్యార్థులు సినిమాలకు, సోషల్‌మీడియాకు దూరంగా ఉండాలన్నారు. నాలుగు సంవత్సరాలు కళాశాలలో గడిపి తమ భవిష్యత్‌ను నిర్ణయించుకోవాలన్నారు. ఇంజనీరింగ్ లీడర్లుగా ఎదగాలని ఆయన కోరారు. విశ్వేశ్వరయ్య, అబ్దుల్ కలాం, కురియన్, వరప్రసాద్, సత్య నాదెళ్లను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అరిమంద వరప్రసాద్‌రెడ్డి, సిద్దార్థ్‌రెడ్డి పాల్గొన్నారు.

సీఎంను కలిసిన మాజీ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్



సీఎం రేవంత్‌రెడ్డితో మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ కుటుంబసభ్యులు

కొడంగల్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిని కొడంగల్ మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి రాజేందర్ కుటుంబసభ్యులు కలిశారు. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ నివాసంలో సోమవారం సీఎంను మాజీ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి రాజేందర్ కుటుంబసభ్యులు, కొడంగల్ ప్రభుత్వాసుపత్రి వైద్యులు సాకేత్, శ్రావణి మర్యాదపూర్వకంగా కలిశారు. కొడంగల్‌లో మెడికల్ కళాశాలకు గ్రీన్ సిగ్నల్ రావడంతో సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

'ప్రాజెక్టును అడ్డుకునే కుట్రలను తిప్పికొడదాం'

దౌల్తాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): కొడంగల్-నారాయణపేట లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును అడ్డుకునే కుట్రలను తిప్పికొడదామని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు ప్రమోద్‌రావు, విజయ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో వారు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అమాయకులను రెచ్చగొడుతూ పబ్బం గడుపుతున్నారని విమర్శించారు.

PUBLIC NOTICE

The General Public is hereby informing that **SRI. M VIJAY KUMAR S/O M PANDU,** H.NO:- 4-11-220, RAMAIAHGUDAM ROAD, VIKARABAD, VIKARABAD DIST My Client M/s SHRIRAM FINANCE LTD.Vikarabad Branch.Vikarabad Dist. With a Requesting to advance of Loan by mortgaging his Property.

PART- I DESCRIPTION AND LOCATION OF THE PROPERTY.

All that the OPEN PLOT NO:- 160/PART IN SY.NO:- 64/,80 &81/1/1, L.P NO:-17/2016/H, ADMEASURING 117.77Sq.YDS,OR 98.47 sq. MTRS Situated at TIRUMALA HILLS NEAR INDIRA NAGAR COLONY, VIKARABAD DIST. And Bounded; **North:** PLOT NO:-160/PART. **South:** PLOT NO:-161. **East:** PLOT NO:-159, **West:** 40 FEET WIDE ROAD.My client if any person. / Institution if having objections, claims interest disputed for the above, intended transaction he / she / they may contact the undersign with document proof substantiating his / her / their objections claims details if disputes etc., within (5) days from the date will proceed with transaction as if there no III party claims objections disputed in respect of above said property and thereafter no claims objections disputes will be entertained.

SD/- K SRINIVAS RAO, C. KAPIL DEV
Advocates,
Off: 4-7-226/109, Sakethnagar, Vikarabad, Vikarabad. Dist - 501101, PH: 9246362213; 9603019574.

సంక్షిప్తంగా..

ఇన్సూరెన్స్ కార్డుల పంపిణీ

తాండూరు రూరల్: అంతారంలో అంకిత ఫౌండేషన్ ప్రతినిధి నర్సింహులు సోమవారం 150మందికి ప్రధాన మంత్రి సురక్ష బీమా పథకం కింద ఈశ్రామ్ ఇన్సూరెన్స్‌కార్డులను పంపిణీ చేశారు. గ్రామస్థులు సంగెం శ్రీనివాస్, తాంత్ర స్వామిదాస్, బ్యాగరి వెంకటయ్య పాల్గొన్నారు.

రోడ్లను నాణ్యతాయుతంగా చేపట్టాలి

బొంరాస్‌పేట్: పంచాయతీ రాజ్ రోడ్లను నాణ్యతయుతంగా చేపట్టి పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఎస్ఈ శ్రీనివాస్‌రెడ్డి ఆదేశించారు. నాగారం-బొంరాస్‌పేట్, మహంతీపూర్-బొంరాస్‌పేట్ రోడ్లను సోమవారం పరిశీలించారు. 163వ జాతీయ రహదారి నుంచి కాకర్లగండి తండా వరకు రూ.కోటీ 8లక్షలతో బీటీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఈ సుదర్శన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ జయకృష్ణ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నర్సిములుగౌడ్ పాల్గొన్నారు.

స్థానికేతరులకే ప్రాధాన్యమిస్తారా?

కీసర: మండల విద్యుత్ ఏఈ స్థానికేతరుల కాంట్రాక్టర్లతో కుమ్మక్కయ్యాడని స్థానిక కాంట్రాక్టర్ ముక్క మహేందర్ ఆరోపించాడు. ఈమేరకు సోమవారం కీసరలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల విద్యుత్ ఏఈ మురళీకృష్ణ స్థానిక కాంట్రాక్టర్లకు కాకుండా, స్థానికేతురుల కాంట్రాక్టర్లకు త్వరగా పనులు చేస్తుందని తెలిపాడు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ పరిధిలోని అన్నోజిగూడ దివ్యాంగుల కాలనీ ప్రజలకు నేటికి మిషన్ భగీరథ తాగునీరు అందక బోర్‌నీటినే తాగాల్సి వస్తున్నందున తక్షణమే చర్యలు తీసుకొని నీటి సమస్యను పరిష్కరించాలని సోమవారం సీపీఐ నాయకులు మున్సిపల్ కమిషనర్ నిత్యానంద్‌ను కలిసి వినతి అందజేశారు.

రేపు జోనల్‌స్థాయి కబడ్డీ పోటీలు

ఘట్‌కేసర్: 69వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఘట్‌కేసర్ జోనల్ స్థాయి కబడ్డీ పోటీలను రేపు(బుధవారం) నిర్వహిస్తున్నట్లు జోనల్ కార్యదర్శి శ్రీరాములు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్ 14, 17 విభాగాల్లోని బాలుర, బాలికలను ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలపారు. వివరాలకు 9542026432 నంబరును సంప్రదించాలన్నారు.

కిరాణా మర్చంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడి మృతి

తాండూరు: తాండూరు కిరాణా మర్చంట్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, ప్రముఖ వ్యాపారి ఎదురె పాండయ్య సోమవారం తాండూరులోని తన నివాసంలో మృతి చెందారు. గత కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. అంత్యక్రియలను సోమవారం పూర్తిచేశారు.

పరిహారం అందించాలి

కొడంగల్: రోడ్డు విస్తరణలో భాగంగా స్థానిక మక్కా మసీద్ ఎదురుగా ఉన్న దుకాణ సముదాయాలకు ప్రభుత్వం పరిహారం అందించాలని మైనార్టీ నాయకుడు ఎస్ఎం.గౌసన్ కోరారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రోడ్డు విస్తరణలో దుకాణ సముదాయాలను తొలగించాలని అధికారులు చెబుతుండటంతో పరిహారం అందించేందుకు ప్రభుత్వం స్పష్టమైన హామీ ఇవ్వాలన్నారు. దుకాణాల దాయంతో మసీద్‌లో ఇమామ్, మౌజన్‌లకు వేతనాలు అందిస్తున్నామన్నారు.

క్రైం కార్నర్

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య



సంతోష్ (ఫైల్)

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఎదులాబాద్‌లో సోమవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ, ఎదులాబాద్ వంజరివాడకు చెందిన అముద సంతోష్ అలియాస్ సాగర్(25) గతంలో క్యాబ్ నడిపేవాడు. ఇటీవల ఉద్యోగం లేక మద్యానికి బానిసయ్యాడు. సోమవారం తెల్లవారుజామున 4గంటలకు ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి అముద రోజా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మనస్తాపంతో మహిళ..

మోమిన్‌పేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): మనస్తాపంతో మహిళా ఆత్మహత్య చేసుకున్న ఘటన మోమిన్‌పేట్ మండలంలోని చక్రంపల్లిలో చోటు చేసుకుంది. ఎస్ఐ అరవింద్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని చక్రంపల్లి ఎస్సీ కాలనీలో నివసిస్తున్న హనుమనోళ్ల కుమార్ భార్య రాములమ్మ(30) ఇంటి సమీపంలోని సుజాత కుమారుడితో గొడవ పడింది. గొడవ పడుతూ సుజాత కుమార్‌పై దాడి చేసింది. దీంతో సుజాత అన్న కొల్కుందకు చెందిన బండారి బాల్‌రాజ్ ఫోన్ చేసి తనపై కుమార్ దాడి చేశాడని చెప్పడంతో బండారి బాల్‌రాజ్ ఇంటికి వచ్చి తాళం వేశాడు. తన అక్కపై కుమార్ దాడి చేశాడని గ్రామ పెద్దలతో పంచాయతీ పెట్టారు. దీంతో మనస్తాపానికి గురైన రాములమ్మ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. వీరికి ఇద్దరు కూతుర్లు తేజశ్రీ(8), దివ్యశ్రీ(6) ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మర్పల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. రాములమ్మ అక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మనోజ్(ఫైల్)

వికారాబాద్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): జన్మదిన వేడుకకు హాజరై ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. ఈ ఘటన వికారాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బొంరాస్‌పేట మండలం మెట్లకుంటకు చెందిన సందగళ్ల మనోజ్(32)కు భార్య రమాదేవితో వివాహం కాగా వారికి ఒక బాబు ఉన్నాడు. ఈనెల 4వ తేదీన వికారాబాద్ పట్టణంలోని బసంత్ ఫంక్షన్‌హాల్‌లో రమాదేవి బంధువుల జన్మదిన వేడుకకు హాజరయ్యారు. మనోజ్ రాత్రి బయటకు వెళ్లి వస్తానని వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భార్య వికారాబాద్ పోలీస్ స్టేషన్‌లో 5వ తేదీన ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఈనెల 7వ తేదీ రాత్రి బసంత్ ఫంక్షన్ హాల్ పక్కనే ఉన్న రైలు పట్టాల పక్కన మనోజ్ మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. ఈ మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కారు ఢీకొని వృద్ధురాలు దుర్మరణం

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొట్టిన ప్రమాదంలో ఓ వృద్ధురాలు దుర్మరణం చెందింది. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో చోటుచేసుకుంది. సీఐ ఎం.బాలస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్‌కు చెందిన దాచారం మల్లమ్మ(77) సోమవారం ఉదయం 7గంటలకు ఇంటి నుంచి బయల్దేరి యాదాద్రి- భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం, నెమెరగొమ్ములలోని బంధువుల ఇంటికి వెళ్తోంది. అవుశాపూర్ ఎస్‌పీఆర్ వద్ద మల్లమ్మ బస్సు దిగి రోడ్డుదాటుతుండగా వరంగల్ నుంచి అతివేగంగా వచ్చిన షిఫ్ట్‌డిజైర్ కారు ఆమెను ఢీకొట్టి మరో బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లమ్మ తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతిచెందింది. బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు మల్లమ్మ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అతివేగంగా కారు నడిపిన అవుశాపూర్‌కు చెందిన కారు డ్రైవర్ చిలకమారి సుదర్శన్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ..

కులకచర్ల, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతిచెందిన ఘటన మండలంలోని చెల్లాపూర్‌లో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చిన్న వెంకటయ్య భార్య విజయలక్ష్మి ఆదివారం రాత్రి సంపులో నీళ్ల నింపేందుకు బోరు మోటారు ఆన్ చేసే ప్రయత్నంలో విద్యుదాఘాతానికి గురైంది. ఈ క్రమంలో నీటి సంపులో పడి మృతిచెందింది. భర్త చిన్న వెంకటయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేశ్ కుమార్ తెలిపారు.

'ఉల్లాస్'ను విజయవంతం చేయాలి

బషీరాబాద్/చౌడాపూర్/కులకచర్ల/దుద్యాల/బొంరాస్‌పేట్, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): 15 ఏళ్ల పైబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉల్లాస్(అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమాన్ని వాలంటీర్లు విజయవంతం చేయాలని బషీరాబాద్ విద్యాధికారి దూస రాములు అన్నారు. బషీరాబాద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉల్లాస్- నవభారత సాక్షరతా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛంద బోధకుల పాత్రపై సోమవారం మండలస్థాయి సమావేశం జరుగగా ఆయన హజరయ్యారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 1197 మంది నిరాక్షరాస్యులను గుర్తించినట్లు తెలిపారు. చౌడాపూర్ మండల కేంద్రంలో ఎంఈవో రాంచందర్ మండల స్థాయి నవభారత సాక్షరత ఉల్లాస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ, ఆర్‌పీలు కృష్ణ, గంగాపూరి, వీవోఏలు పాల్గొన్నారు. కులకచర్ల మండల కేంద్రంలోని కేజీబీవీలో సోమవారం అంతర్జాతీయ అక్షరభ్యాస దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ దేవి మాట్లాడుతూ అక్షరభ్యాస దినోత్సవం విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో మ్యాజిక్ బస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దుద్యాల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం నిర్వహించారు. ఉపాధ్యాయులు విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి విద్య ప్రాముఖ్యతను అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయరామారావు, రవీందర్‌గౌడ్, శ్రీనివాసులు, వేణుగోపాల్, మెరుగు వెంకటయ్య పాల్గొన్నారు. బొంరాస్‌పేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంఈవో హరిలాల్, రీసోర్స్ పర్సన్ అన్వర్, బాలకృష్ణ విద్యా ప్రాముఖ్యతను ఈ సందర్భంగా వివరించారు.

ఎస్‌బీఐ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

దోమ, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎస్బీఐ సిబ్బంది పనితీరును మార్చుకోవాలని బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు గోవర్ధన్ ముదిరాజ్ అన్నారు. ఖాతాదారులు సోమవారం బ్యాంకుకు వెళ్లగా ఉదయం నుంచి సర్వర్ పనిచేయడం లేదని ఇబ్బందులకు గురిచేయడం సరైంది కాదన్నారు. సర్వర్ పని చేయకుంటే బ్యాంకు ఎందుకు తెరిచి ఉంచారని ప్రశ్నించారు. ఈ విషయంపై సిబ్బందిని ప్రశ్నించగా సంబంధిత క్యాషియర్ అత్యుత్సాహంతో మేనేజర్ సమక్షంలోనే మా ఇష్టమని, ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోవాలని దురుసుగా సమాధానం ఇచ్చాడని ఆరోపించారు.